


హాలియాలో ఏర్పాటు చేస్తున్న సభా వేదిక

## నేడు హాలియాలో మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటన

హాలియా, అక్టోబర్ 28: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదివారం హాలియాకు రానున్నారు. ఈ సందర్భంగా 10వేల మందితో సభ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ విజ్ఞప్తి మేరకు ఈ ప్రాంత గిరిజనులకు ప్రభుత్వం చేసిన కృషిని వివరించేందుకు మంత్రి వస్తున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా మంత్రి పర్యటన ఏర్పాట్లను శనివారం డీఎస్పీ వెంకటగిరి, సీఐ గాంధీనాయక్, ఎస్సై శోభన్‌బాబు పర్యవేక్షించారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్ కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు.



మీట్యాతండాలో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

## మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటనను విజయవంతం చేయాలి

- ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

త్రిపురారం, అక్టోబర్ 28: నాగార్జునసాగర్ నియోజకవర్గానికి రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదివారం రానున్నారని, ఆమె పర్యటనను విజయవంతం చేయాలని ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని బడాయిగడ్డ, రాగడప, మీట్యాతండా, పలుగుతండా, లచ్యాతండా గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ గెలుపునకు మద్దతుగా మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటిస్తున్నారన్నారు. సుపరిపాలన అందిస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వం బలపరిచేలా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ జయరాంనాయక్, సర్పంచ్‌లు సుశీల్‌నాయక్, హనుమంతునాయక్, జయరాంనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు లక్ష్మా, గాసిరాం, గిరిజన నాయకులు దేవుసింగ్‌నాయక్, రఘునాయక్, రామచందర్‌నాయక్, లక్పతినాయక్ ఉన్నారు.

### బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి

పెద్దవూర : మంత్రి సత్యవతి రాథోడ్ ఆదివారం హాలియాకు రానున్న దృష్ట్యా బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జటావత్ రవినాయక్ కోరారు. శనివారం పెద్దవూరలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటక వెంకట్‌రెడ్డి, నాయకులు బోయ నరేందర్‌రెడ్డి, షేక్ బషీర్, శ్రీకర్‌నాయక్, శివాజీనాయక్ పాల్గొన్నారు.

## వరిలో పిండినల్లి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- కేవీకే శాస్త్రవేత్తలు



పెద్దదేవులపల్లిలో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

త్రిపురారం, అక్టోబర్ 28 : వరి పంటలో వచ్చే పిండినల్లి తెగులు నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్. రాములమ్మ, పల్లవి, సంధ్యారాణి సూచించారు. శనివారం మండలంలోని పెద్దదేవులపల్లితో పాటు పలు గ్రామాల్లో సాగు చేసిన వరి పంటను వారు పరిశీలించి రైతులకు సూచనలు అందించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పిండినల్లి ఉధృతంగా వ్యాపిస్తుందని, వరి చేలకు ఆరుతడిగా నీటిని ఇవ్వడం, గడ్డి, కలుపు ఎక్కువగా లేకుండా చూసుకోవాలని సూచించారు. పిండినల్లి వరి చేలో తల్లి, పిల్ల ఆకుల నుంచి, మట్టల నుంచి రసం పీల్చి మొక్కలను క్షీణింపజేస్తుందన్నారు. వరి మడిలోనే సుడులు సుడులుగా వాలిపోయి కనిపిస్తుందన్నారు. వరి చేలో నీరు అధికంగా నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తెగులు ఉధృతి అధికంగా ఉంటే బయోమాథ్సిన్ 50 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు.

# ప్రగతి నిరోధకులకు గుణపాఠం చెప్పాలి

- నియోజకవర్గ ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే
- మరోసారి అవకాశమిస్తే నల్లగొండను నందనవనంగా మారుస్తా
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 28 : ప్రగతి నిరోధకులకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెప్పాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని 29, 30, 31 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రతి ఇంటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌కు మరోసారి అధికారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచిందన్నారు. ఐదేండ్లు తమతో ఉండి అధికారం అనుభవించి.. ఎన్నికలు రాగానే డబ్బులకు అమ్ముడుపోయి ప్రగతి నిరోధకుల చెంత చేరిన నాయకులకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఎవరు పోయినా నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉంటారని దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం అరిగోస పడ్డారని గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తుంటే.. అంత అవసరం లేదు, కేవలం మూడు గంటలే చాలంటూ వ్యాఖ్యానించిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి రైతులే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. 20 ఏండ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి నల్లగొండకు ఐటీ హబ్, బత్తాయి మార్కెట్, మెడికల్ కళాశాల తీసుకు రాలేని కోమటిరెడ్డి ఇప్పుడు ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు.

### రూ.1,450 కోట్లతో నల్లగొండ అభివృద్ధి

రూ.1,450 కోట్లతో నల్లగొండను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నానని, మరో రెండేండ్లలో ఆ పనులు పూర్తి అయ్యే అవకాశం ఉందని, మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించి అభివృద్ధిని కొనసాగించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తే రూ.3016 పింఛన్ రూ.5016గా అవుతుందని, రైతుబంధు రూ.12వేల నుంచి రూ.16వేలకు పెరుగుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అవి కొనసాగాలంటే రాష్ట్రంలో సీఎం కేసీఆరే రావాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తే అర్హులైన మహిళలకు రూ.3వేల భృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు బీపీఎల్ కుటుంబాలకు రూ.5లక్షల బీమా కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ఆరు గ్యారంటీలు అమలుకు సాధ్యం కానివని, వాటిపై ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు.

### వాడ వాడనా ఘన స్వాగతం

బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రచారానికి వాడ వాడనా ప్రజల నుంచి మద్దతు లభిస్తున్నది. మహిళలు హారతులతో స్వాగతం పలుకుతూ తాము మీ వెంటే ఉన్నామంటూ భరోసా ఇస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, స్థానిక కౌన్సిలర్లు మారగోని నవీన్‌గౌడ్, కొమ్ము నాగలక్ష్మి, నేలపట్ల రమేశ్, కొమ్ము శంకర్, మిర్యాల స్వామి, సిరాజ్, ఫయాజ్ పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

- ఎస్పీ అపూర్వరావు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నిడమనూరు, అక్టోబర్ 28 : ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు సూచించారు. మండల కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా కార్యాలయ ఆవరణలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నామినేషన్ల సమర్పణ కోసం వచ్చే అభ్యర్థుల వాహనాలను 200 మీటర్ల దూరంలో నిలిపివేయాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నామినేషన్ల సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సోం నారాయణ్‌సింగ్, తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, హాలియా సీఐ గాంధీనాయక్, ఎస్ఐలు గోపాల్‌రావు, ఎం.శోభన్‌బాబు ఉన్నారు.

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తిప్పర్తి,అక్టోబర్ 28: మండల కేంద్రంతో పాటు రాజుపేట ,ఇండ్లూరు. పజ్జూరు, మామిడాల గ్రామాల్లో శనివారం పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ధర్మ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. ఎవరైన ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సతీష్, శేఖర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## రాజవరం విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేత

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 28: మండలంలోని రాజవరంలోని జడ్పీహెచ్ఎస్‌లో 9, 10వ తరగతికి చెందిన పది మంది పేద విద్యార్థులకు పొలారీస్ ఐటీ కంపెనీ వారి ఉల్లాస్ ట్రస్ట్ సభ్యులు రూ.1000 చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్‌లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఉల్లాస్ ట్రస్ట్ సభ్యులు వెంకటఅంజంరాజు, ఆంజనేయరాజు, కృష్ణంరాజు, హెచ్ఎం ఆనందగిరి పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ నల్లగొండ జిల్లా, బొమ్మలరామారం మండలం, రామలింగంపల్లి గ్రామం వద్ద గల సర్వే నం. 158/A లోని ఎ. 1-33 గుంటలు, సర్వే నం. 158లోని ఎ. 0-07 గుంటలు, సర్వే నం. 158/EEలోని ఎ. 2-32 గుంటలు, మొత్తం విస్తీర్ణం ఎ. 4-32 గుంటల విస్తీర్ణం గల భూమిని కొనుగోలు చేయుటకు ఉద్దేశిస్తున్నారు. సరిహద్దులు: ఉత్తరం: వల్లపు రాజమల్లయ్య భూమి, దక్షిణం: వల్లపు మల్లయ్య భూమి, తూర్పు: బండ్ల మార్గం/ రోడ్ మరియు పడమర: వల్లపు రాజమల్లయ్య భూమి. సదరు భూమి M/s హెర్మెస్ కెమికల్స్ కంపెనీ (P) లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ O జటియా తండ్రి ఓంప్రకాష్ జటియాకు చెందినది. సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఒరిజినల్ డాక్యుమెంట్లతో ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోగా దిగువ సంతకందారును సంప్రదించవచ్చు. లేనిచో నా క్లయింట్ తమ పేరున సేల్ డీడ్ ఎగ్జిక్యూషన్ కొరకు తదుపరి ముందుకు సాగుతారు మరియు ఆ తరువాత ఎట్టి క్లెయిమ్ పరిశీలించబడదు.

సం/- **సి. ప్రవీణ్,** అడ్వకేట్
ఇం.నం. 8-3-833/202, ప్లాట్ నం. 202,
కమలాపురి కాలనీ, ఫేజ్ - II, హైదరాబాద్ -
500073. సెల్: **9985444448**